సాక్షి కామారెడ్డి

సోమవారం ၊ 3 ၊ ఫిబ్రవరి ၊ 2025



యోగా, ధ్యాన కేంద్రాలుండాలి

ప్రతి గ్రామంలో యోగా, ధ్యాన కేంద్రాలు ఉండాలని పతంజలి యూనివర్సిటీ డీన్ స్వామి పరమార్థదేవ్ పేర్కొన్నారు.

- 8లో ▸



చెట్ల కిందే చదువులు

ఎల్లారెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో తరగతి గదుల నిర్మాణం పూర్తి కాకపోవడంతో చెట్ల కిందే చదువులు సాగుతున్నాయి.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.1 /15.1

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నీలం చిన్నరాజులు!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నీలం చిన్నరాజులు ఏకగ్రీవంగా ఎన్నికవనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్లు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా అధ్యక్ష పదవికి నీలం చిన్నరాజులు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక లాంఛనం కానుంది. కామారెడ్డి బల్దియా పరిధిలోని దేవునిపల్లికి చెందిన నీలం చిన్నరాజులు న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. చాలాకాలంగా బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. పార్టీకి సంబంధించిన వివిధ పదవుల్లో కొనసాగుతూ వచ్చారు.

కొనసాగుతున్న నీటి విడుదల



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆయకట్టు అవసరాలకోసం మూడో విడత నీటి విడుదల గతనెల 31న ప్రారంభమైంది. ప్రధాన కాలువకు రోజూ 1,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కోతకొచ్చిన శనగ పంట



మద్నూర్: శనగ పంట కోతకొచ్చింది. రైతులు నూర్పిడి ఏర్పాట్లలో ఉన్నారు. మద్నూర్ మండలంలో 15 వేల ఎకరాలలో, డోంగ్లీ మండలంలో 9 వేల ఎకరాల్లో శనగ పంట సాగయ్యింది. ఎకరాకు ఏడు నుంచి తొమ్మిది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని రైతులు భావిస్తున్నారు. శనగలకు క్వింటాలుకు రూ. 7 వేల మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

నేడు జైళ్ల శాఖ డీజీ రాక

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్ర కారాగారాన్ని సోమవారం జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా సందర్శించనున్నారు. ఆమె వెంట జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధుశర్మ రానున్నారు.

ఎల్లారెడ్డిలోని ఐకేపీ భవనంలో కొనసాగుతున్న ఆర్డీవో కార్యాలయం



అద్దె భవనాల్లోనే..

- చాలా కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- అరకొర వసతులతో ఇబ్బంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలతో పాటు రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కార్యాలయాల నిర్మాణానికి నిధులు మాత్రం మంజూరు చేయలేదు. దీంతో చాలా కార్యాలయాలు అరకొర వసతులున్న అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో ఉద్యోగులతోపాటు ఆయా కార్యాలయాలకు వస్తున్న ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

ఎల్లారెడ్డిలో..

కామారెడ్డి జిల్లా ఆవిర్భావంతోనే ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్లు ఏర్పాటయ్యాయి. ఎల్లారెడ్డిలో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాన్ని ఐకేపీ భవనంలో ఏర్పాటు చేశారు. అరకొర వసతులున్న భవనంలోనే కార్యాలయం కొనసాగుతోంది. అలాగే ఎల్లారెడ్డి పోలీస్ సబ్ డివిజన్ అధికారి కార్యాలయాన్ని మొదట కొంత కాలం పోలీసు స్టేషన్‌లో, తర్వాత కొంతకాలం ఇరిగేషన్ భవనంలో నిర్వహించారు. తర్వాత అద్దె భవనంలోకి మార్చారు. ఎనిమిదేళ్లు గడిచినా ఇప్పటికీ ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాల భవన నిర్మాణానికి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. బల్దియాకు సైతం సొంత కార్యాలయం లేదు. పంచాయతీ భవనంలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.



ఎల్లారెడ్డిలో అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్ సబ్ డివిజనల్ అధికారి కార్యాలయం

బాన్సువాడలో మెరుగు..

బాన్సువాడ డివిజన్ కేంద్రంలో మాత్రం రెవెన్యూ డివిజన్ కార్యాలయం నిర్మాణం పూర్తయ్యింది. అందులోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. భవన నిర్మాణం కోసం నిధులు మంజూరై పనులు కొనసాగుతున్నాయి. కొద్దిరోజుల్లో పనులు పూర్తయి సొంత భవనంలోకి మార్చనున్నారు. మున్సిపల్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించారు.

పలు శాఖల కార్యాలయాలు..

జిల్లాలో పలు డివిజన్, మండలాల్లో వివిధ శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో దశాబ్దాలుగా అద్దె భవనంలో ఉంది. దోమకొండలో ఎక్సైజ్ కార్యాలయం, బిచ్కుంద, ఎల్లారెడ్డి సర్కిల్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయాలు పలుచోట్ల అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖ కార్యాలయాలకూ సొంత భవనాలు లేవు. అన్ని కార్యాలయాలను ఒకేచోట నిర్మించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

మండలాల్లోనూ అదే పరిస్థితి

జిల్లా ఏర్పాటు సమయంలో ఏర్పాటైన రాజంపేట, బీబీపేట, రామారెడ్డి, పెద్దకొడప్‌గల్ మండలాల్లో తహసీల్, మండల పరిషత్ కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలు నిర్మించలేదు. కొన్ని కార్యాలయాలు అద్దె భవనాలు, మరికొన్ని ఇతర శాఖల కార్యాలయాల్లో కొనసాగుతున్నాయి. రామారెడ్డిలో పోలీస్ స్టేషన్ పాత గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగుతోంది. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు కూడా అరకొర వసతుల మధ్య నడుస్తున్నాయి. రాజంపేట పోలీస్ స్టేషన్ సొసైటీ భవనంలో కొనసాగుతోంది. బీబీపేటలో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఇక్కడ పోలీస్ స్టేషన్ చాలా ఏళ్లుగా ఉండడంతో దానికి సొంత భవనం ఉంది. నస్రుల్లాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మించారు. కొత్తగా ఏర్పాటైన డోంగ్లీ, మహ్మద్‌నగర్, పాల్వంచ మండలాల్లో కార్యాలయాల ఊసే లేదు. సొంత భవనాలు లేకపోవడం పాలనకు ఇబ్బందికరంగా ఉంది.

అధికారులు, సిబ్బందితో పాటు పనుల కోసం వచ్చే ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నేటి నుంచి ఎమ్మెల్సీ నామినేషన్ల ఘట్టం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం సోమవారం ప్రారంభం కానుంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసి, నామినేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. ఈనెల 10 వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 27న పోలింగ్ జరుగనుంది.

వేడెక్కనున్న రాజకీయం

కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డిల పదవీకాలం మార్చి 29న ముగియనుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై ప్రధాన పార్టీలు కన్నేశాయి. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వి.నరేందర్‌రెడ్డి పేరును ప్రకటించింది. బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గం పరిధిలో పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు ఉండడంతో బీజేపీ సైతం పోటీని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాగా పోటీ విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పీఆర్‌టీయూ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్–టీపీటీఎఫ్ సంయుక్త అభ్యర్థిగా వై.అశోక్‌కుమార్, తపస్ నుంచి కొమరయ్య బరిలో దిగుతున్నారు. ఇప్పటికే ఆయా పార్టీలు, సంఘాల అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలనుకుంటున్నవారు ప్రచారంలో దూసుకుపోతున్నారు. నామినేషన్ల ఘట్టం కూడా ప్రారంభం కానుండడంతో రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

బోనస్ పైసలు ఎప్పుడిస్తరో?

- పంట విక్రయించి నెలలు గడుస్తున్నా అందని డబ్బులు
- ఆందోళన చెందుతున్న రైతులు

భిక్కనూరు : కొనుగోలు కేంద్రాలలో సన్నరకం వడ్లు విక్రయించిన రైతులు.. నెలలు గడుస్తున్నా బోనస్ డబ్బులు అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు. బోనస్ రాని రైతులు వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

సన్న రకం వరిధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో 15,898 మంది రైతులు 1,00,663 క్వింటాళ్ల సన్న వడ్లను కొనుగోలు కేంద్రాలలో విక్రయించారు. వాటికి సంబంధించి రూ. 50.33 కోట్లు బోనస్‌గా రావాలి. అయితే ప్రభుత్వం 15,655 మందికి సంబంధించి రూ.49.81 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇంకా 243 మందికి సంబంధించి రూ.52 లక్షలు రావాల్సి ఉంది. వారు పంటను విక్రయించి నెలలు గడుస్తున్నా బోనస్ రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డబ్బుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం డబ్బులు విడుదల చేయగానే ఖాతాలలో జమ అవుతాయని అధికారులు చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. తమకు బోనస్ డబ్బులు వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



రెండు నెలల దాటింది

ప్రభుత్వం బోనస్ ఇస్తామనడంతో సన్న రకం వడ్లు పండించాను. 58 క్వింటాళ్లను కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. రెండు నెలలవుతోంది. నాకు ఇప్పటి వరకు బోనస్ రాలేదు. వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. బోనస్ డబ్బులు వచ్చేలా చూడాలి.

– అలకొండ గంగారెడ్డి, రైతు, అంతంపల్లి

జిల్లావాసులకు అరుదైన గౌరవం!

- ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న జిల్లావాసులు
- స్పెషల్ గెస్ట్‌గా వెళ్లిన డ్వాక్రా మహిళ
- రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొన్న ఇద్దరు ఎన్‌సీసీ కెడెట్లు



ఎన్‌సీసీ ఉన్నతాధికారితో ధరావత్ మౌనిక



ఎన్‌సీసీ కెడెట్ శ్రీకాంత్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఢిల్లీలో గతనెల 26న జరిగిన గణతంత్ర దినోత్సవాల్లో కామారెడ్డి జిల్లా నుంచి పలువురు పాల్గొన్నారు. ఉత్సవాలలో స్పెషల్ గెస్ట్‌గా డ్వాక్రా సంఘం సభ్యురాలు, రిపబ్లిక్ డే పరేడ్‌లో ఇద్దరు ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాలలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన వారికి ఆహ్వానాలు అందుతాయి. ముఖ్యంగా ఏదైనా రంగంలో విజయాలు సాధించిన వారిని గుర్తించి ఎంపిక చేస్తారు. అలా స్వయం సహాయక సంఘం నుంచి కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన కమ్మరి లక్ష్మిని ఎంపిక చేశారు. ఆమె రిపబ్లిక్ డే వేడుకలలో స్పెషల్ గెస్ట్‌గా పాల్గొన్నారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వంటి వాటిలో ప్రతిభ కనబరిచిన వారిని రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక చేస్తారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ధరావత్ మౌనికతోపాటు ఆర్‌కే డిగ్రీ కాలేజీకి చెందిన శ్రీకాంత్ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యారు.

పరేడ్‌కు ఇద్దరు..

కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ధరావత్ మౌనిక ఎన్‌సీసీ కెడెట్‌గా ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌కు వెళ్లారు. ఎన్‌సీసీలో ప్రతిభ చాటినందుకు ఆమెకు ఈ అవకాశం దక్కింది. గణతంత్ర దినోత్సరం రోజున నిర్వహించిన పరేడ్‌లో ఆమె పాల్గొంది. ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఏ.సుధాకర్ అభినందించారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌కే డిగ్రీ కాలేజీ విద్యార్థి, ఎన్‌సీసీ కెడెట్ శ్రీకాంత్ కూడా రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్నాడు. ప్రధానమంత్రికి ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ బృందం తరపున గౌరవవందనం సమర్పించాడు. అతడిని కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సైదయ్య, ప్రతినిధులు దత్తాద్రి, నవీన్ తదితరులు అభినందించారు.

వ్యాపారంలో రాణిస్తున్న రాధ..



చిన్నమల్లారెడ్డికి చెందిన కమ్మరి రాధ మండల సమాఖ్య అ ధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. దశాబ్దకాలానికి పైగా ఆమె సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. మొదట్లో రాధ ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉండేది. సంఘ సభ్యురాలిలా, సంఘ నాయకురాలిగా ఆమె వివిధ రకాలుగా శ్రమించి కష్టాలను అధిగమించింది. సంఘం ద్వారా పెట్టుబడికి అప్పు తీసుకుని వస్త్ర దుకాణం ఏర్పాటు చేసుకుంది. భర్తకు కుకింగ్‌లో శిక్షణ ఇప్పించగా ఆయన పని చేసుకుంటున్నాడు. ఇద్దరు కలిసి ఏటా రూ.1.80 లక్షల వరకు సంపాదిస్తున్నారు. ఆమె గణతంత్ర వేడుకలకు స్పెషల్ గెస్ట్‌గా ఎంపికయ్యారు. భర్తతో కలిసి ఢిల్లీ వెళ్లి, వేడుకలలో పాల్గొన్నారు. చీరల వ్యాపారం చేస్తున్న తాను భర్తతో కలిసి మహిళా శక్తి కార్యక్రమం ద్వారా క్యాంటీన్ నిర్వహించాలని అనుకుంటున్నట్లు రాధ తెలిపింది. ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొనడం తన జీవితంలో మరిచిపోలేని విషయమని పేర్కొంది.

నేటి నుంచి ఇంటర్ 'ప్రాక్టికల్స్'

- నిఘా నీడలో నిర్వహణకు ఏర్పాట్లు
- 22 వరకు పరీక్షలు

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఇంటర్ సెకండియర్ జనరల్ సైన్స్ విద్యార్థులతోపాటు ఒకేషనల్ కోర్సుల మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం సెషన్‌లో 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌లో 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలను సీసీ కెమెరాల నిఘా నీడలో నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలతోపాటు గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలలకు ఇంటర్‌బోర్డు సీసీ కెమెరాలను సమకూర్చింది. ప్రైవేట్ కళాశాలల్లోని కేంద్రాలకు ఆయా సంస్థల యాజమాన్యాలే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఇంటర్ బోర్డు ఆదేశించింది.

48 పరీక్ష కేంద్రాలలో..

జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం 48 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లతో పాటు రెండు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. కలెక్టర్ చైర్మన్‌గా, ఇంటర్ నోడల్ అధికారి, ఇతర సభ్యులతో కూడిన హైపవర్ కమిటీ ఈ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించనుంది. జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులు 15,267 మంది, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు 3,305 మంది ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరుకానున్నారు. అయితే ప్రాక్టికల్స్ పరీక్ష ఫీజు కట్టనివారు ఇంకా 3,979 మంది విద్యార్థులు ఉన్నారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.



జిల్లాకేంద్రంలోని శ్రీసాందీపని కళాశాల సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఏర్పాట్ల పరిశీలన

జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీసాందీపని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ల్యాబ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని యాజమాన్యానికి సూచించారు. ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట కళాశాల డైరెక్టర్ బాలాజీరావు తదితరులున్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం

జిల్లాలో 48 ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రతి ల్యాబ్‌లో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించాం. ఏర్పాటు చేయకుంటే బోర్డు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– షేక్ సలాం, ఇంటర్ నోడల్ అధికారి, కామారెడ్డి

తెలంగాణ నెట్‌బాల్ టీం కోచ్‌గా రమేష్



నిజామాబాద్ నాగారం: ఉత్తరాఖండ్‌లో ఈనెల 3 నుంచి 15 వరకు జరిగే 38వ జాతీయ క్రీడలకు తెలంగాణ నెట్ బాల్ టీం కోచ్‌గా జన్నేపల్లి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ ఎంపికయ్యారని నెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. రమేష్‌ను జిల్లా విద్యాధికారి అశోక్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నాగమణి, జన్నేపల్లి ఇన్‌చార్జి మండల విద్యాధికారి అశోక్, టీచర్లు అభినందించారు.

'సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టాన్ని పరిరక్షించాలి'

కామారెడ్డి టౌన్: సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టాన్ని పరిరక్షించాలని తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్(టీఎంఎస్‌ఆర్‌యూ) రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫారం ఏ లో ఫార్మా యాజమాన్యాలు నియామక పత్రాలు ఇవ్వాలన్నారు. మందుల ధరలను తగ్గించాలని, మందులు, మందుల పరికరాలపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయాలని, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలని నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ ఫార్మా వ్యాక్సిన్ కంపెనీలను పునరిద్ధరించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

జిల్లా కార్యవర్గం ఎన్నిక

టీఎంఎస్‌ఆర్‌యూ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామోజు రవీంద్రాచారి, కార్యదర్శిగా గోన్ల ప్రేంకుమార్, ఉపాధ్యక్షులుగా మహేందర్ రెడ్డి, షకీల్ పాషా, సహాయ కార్యదర్శులుగా బీఎస్ సంతోష్, రాజేష్, కోశాధికారిగా ధన్‌రాజ్ ఎన్నికయ్యారు.

ఇదొక్క అందమైన ఇల్లు..



రేకుల ఇల్లు చుట్టూ ఇనుప జాలి, కంకరతో ఏర్పాటు చేసుకున్న ప్రహరీ



పాత టైర్లతో తయారు చేసుకున్న సోఫా, కుర్చీలు

జిల్లాలోని మారుమూల మండలమైన పెద్ద కొడప్‌గల్‌లోని పోచారం తండాలో ప్రధాన రోడ్డు వెంట ఉన్న ఓ ఇల్లు ఆకర్షిస్తోంది. ఆ ఇంటి యజమాని సృజనాత్మకత అందరినీ కట్టిపడేస్తోంది. గ్రామానికి చెందిన కాశీనాథ్ అనే వ్యక్తి రేకులతో అందమైన ఇంటిని నిర్మించుకున్నాడు. ఇనుప జాలీలు చేయించి అందులో కంకర నింపి ప్రహరీగా మార్చేశాడు. పనికిరాని టైర్లతో ఫర్నిచర్ తయారు చేసుకున్నాడు. తక్కువ ఖర్చుతో అందమైన ఇంటిని, పనికిరాని టైర్లతో ఫర్నిచర్‌ను నిర్మించుకున్న కాశీనాథ్‌ను అందరూ అభినందిస్తున్నారు. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



ఆర్మూర్‌టౌన్‌: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్ట ణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో 11వ తెలంగాణ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఉమెన్ చాంపియన్‌షిప్ పో టీలను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ హాజరై క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ జిల్లాల నుంచి మొత్తం 20 జట్లు పాల్గొంటుండగా, రెండు రోజులపాటు పోటీలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి గంగామోహన్, బేస్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ పాల్గొన్నారు.

ప్రజాపంథా నాయకుడు యాదగిరి మృతి



నిజామాబాద్ సిటీ: నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పనిచేసిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు యాదగిరి జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శమని నాయకులు అన్నారు. యాదగిరి అనారోగ్యంతో మృతి చెందగా, పార్థివదేహాన్ని ఆదివారం నగరంలోని ఎన్‌ఆర్ భవన్‌లోని పార్టీ కార్యాలయంలో ఉంచి నివాళులు అర్పించారు. యాదగిరి కళ్లను ఐ బ్యాంక్‌కు దా నం చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యాదగిరి సుదీర్ఘకాలం పార్టీ కోసం పనిచేశారని కొనియాడారు. తన మరణం తరువాత శరీరం స మాజానికి ఉపయోగపడాలనే ఆకాంక్షతో కళ్లు, శరీరాన్ని దానంచేసి చరిత్రలో చిరిచిపోయారన్నారు. యాదగిరి మిత్రులు, సహచరులు, పా ర్టీ నాయకులు వనమాల కృష్ణ, కే సూర్యం, వీ ప్రభాకర్, వేములపల్లి వెంకట్రామయ్య, ఆకు ల పాపయ్య, రమేశ్‌బాబు, కంజర భూమ య్య, మండవ వెంకటేశ్వరరావు, డాక్టర్ లక్ష్మా రెడ్డి, డాక్టర్ సూరి, రజనీకాంత్, నర్రా రామా రా వు, సాంబయ్య, నరేందర్, రామకృష్ణ, వెంకన్న, దేవారాం, రాజేశ్వర్, ముష్క సుధాకర్, సంధ్యా రాణి, సుధారాణి, భాస్కరస్వామి, శివరాజు, రవీందర్, రాధా పాల్గొన్నారు.

ఈ - భద్రతతో చోరీలకు చెక్

- అందుబాటులో అధునాతన పరికరాలు
- ఎక్కడ ఉన్నా అప్రమత్తం చేసే ఎలక్ట్రానిక్ పరికరాలు..

ఖలీల్‌వాడి: జిల్లాలో ఎక్కడో ఓ చోట చోరీ జరిగిందని రోజూ వినబడుతూనే ఉంటుంది. లక్షల నుంచి కోట్లాది రూపాయలు వెచ్చించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారు ఇంటి భద్రతపై మాత్రం రూ.100 నుంచి రూ.500 తాళాలపై ఆధారపడుతున్నాం. దీంతో దుండగులకు చోరీలు చేయడం ఈజీ అవుతోందని, చోరీలను సాంకేతికతతో నివారించొచ్చని పోలీసులు సూచిస్తున్నారు. దీనిపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు సైతం ఇంటికి సాంకేతికంగా భద్రత కల్పించే వస్తువుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్, మార్కెట్‌లో ఇంటికి భద్రతకు సంబంధించిన వస్తువులు అందుబాటులో ఉన్నాయి. సీసీ కెమెరాలు, అప్రమత్తం చేసే అలారాలు, వైర్లను కత్తిరిస్తే తెలిపే ట్యాంపర్ ప్రూఫ్, వీడియోడోర్ ఫోన్, అలారం లాక్ డిటెక్టర్.. ఇలా ఎన్నో ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై అవగాహన కల్పిస్తున్నామని అలాగే కళాబృందాలు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు.



వీడియో డోర్ ఫోన్

మన ఇంటికి వచ్చి డోర్ ముందు ఉన్న వారిని లోపలి నుంచే గుర్తించేందుకు ఉపయోగపడుతుంది. ఇది కాలింగ్ బెల్ లాగా పని చేస్తుంది. వైర్స్, బ్యాటరీతో పనిచేసే ఈ పద్ధతికి రెండు పరికరాలు ఉంటాయి. కాలింగ్ బెల్ బటన్, స్పీకర్ ఉన్న యూనిట్‌ను ఇంటి బయట బిగిస్తారు. స్క్రీన్‌తో కూడిన పరికరాన్ని ఇంటి లోపల పెడతారు. ఇంటికి వచ్చింది అపరిచిత వ్యక్తులా లేక తెలిసిన వారా? అని గుర్తించిన తర్వాత తలుపులు తీసేందుకు ఈ పరికరం ఎంతో తోడ్పుతుంది. దీని ధర రూ.5వేల నుంచి మొదలవుతుంది.

ఇంటి సెంట్రల్ లాక్ సిస్టం



ఇంటి తలుపులకు సెంట్రల్ లాక్ సిస్టంను ఏర్పాటు చేసుకోవాలి. ఈ లాక్ డోర్‌లోపల అమర్చి కనబడకుండా ఉంటుంది. దీనిపై నుంచి గొళ్లెంను ఏర్పాటు చేసుకుని తాళం వేసుకుంటారు. తాళం పగలగొట్టిన సెంట్రల్ లాక్‌సిస్టం ద్వారా డోర్ తెర్చుకోలేదు. దీంతో దుండగులు తాళాలు పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి దొంగతనం చేసే వీలుండదు.

సీసీ కెమెరాలు, గుర్ఖాలు, సెక్యూరిటీ గార్డులు



పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కాలనీల వాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకువాలి. దీంతో కాలనీలోకి కొత్తవారు వస్తే వారిని గుర్తించే అవకాశం ఉంటుంది. అపరిచిత వ్యక్తులు కనబడితే కాలనీవాసులు వివరాలను సేకరించాలి. దీంతో పాటు రాత్రి వేళల్లో గుర్ఖాలను, షాపుల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవడంతో దొంగతనాలు నివారించే అవకాశం ఉంటుంది.

2024లో జిల్లాలో 33 దోపిడీలు జరగగా 21 కేసుల్లో నిందితులను గుర్తించారు. 12 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రాత్రి వేళల్లో 350 చోరీలు జరిగాయి. 65 కేసులను పోలీసులు ఛేదించగా, 285 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పగటి వేళలో 38 చోరీలు జరగగా, 11 కేసుల్లో నిందితులను పట్టుకున్నారు. 27 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2023తో పోలిస్తే 2024లో 7శాతం చోరీలు పెరిగాయి.

వాహనాల కోసం జీపీఎస్



వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తే వాహనం చోరీకి గురైనసమయంలో ఎటువైపు వెళ్లిందో ఇందులో స్పష్టంగా కనబడుతుంది. దీంతో వాహనాన్ని పోలీసుల సహాయంతో తిరిగి పొందే అవకాశం ఉంటుంది. జీపీఎస్ నెట్‌వర్క్ మీద ఆధారపడి ఉంటుంది. ట్రాకింగ్ కిట్‌ను కమ్యూనికేటర్ పరికరంతో వాహనానికి ఏర్పాటు చేస్తారు. ఇది బయట కనిపించకుండా ఇంజిన్ దగ్గర దీనిని బిగిస్తారు. ఈ జీపీఎస్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను వాహనాదారుడి ఫోన్‌కు అనుసంధానం చేస్తారు. ఇంటర్‌నెట్ సహాయంతో వాహనం ఏ ప్రాంతంలో ఉన్నది, ఎక్కడికి వెళ్తోంది? ఎంత స్పీడ్‌లో వెళ్తోంది? అనేది ఫోన్‌లో లేదా కంప్యూటర్‌లో చూసే అవకాశం ఉంటుంది.

అప్రమత్తం చేసే అలారం



పండగలు, సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో డోర్‌కు తాళం వేసి వెళ్తుంటాం. ఈ సమయంలో దొంగలు చోరీ చేసేందుకు ప్రయత్నిస్తే పెద్ద శబ్దంతో ఇంటి యజమానితోపాటు పోలీసులకు సమాచారం వెళ్తుంది. ఇంటికి కంట్రోల్ ప్యానల్ పరికరాన్ని ఏర్పాటు చేసి, దీనికి అనుసంధానంగా తలుపులు, కిటికీలకు సెన్సార్లను ఏర్పాటు చేస్తారు. ఇంటికి తాళం వేసి వెళ్లాక ఎవరైనా తలుపులు, కిటికీలను విరగొట్టి ఇంటిలోకి ప్రవేశించడానికి ప్రయత్నం చేస్తే పెద్ద శబ్దాలు రావడంతోపాటు ఇంటి యజమాని ఫోన్‌కు, పోలీసులకు సమాచారం వెళ్లే విధంగా సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశారు, కమ్యూనికేటర్ పరికరంతోనే ఇదంతా జరుగుతుంది. వీటి ధర రూ.1500 నుంచి రూ.10వేల వరకు ఉంది.

ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది

- పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులుగం దామోదర్ రెడ్డి అన్నారు. దేమికలాన్‌లో గల రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రమేష్ దేమికలాన్‌లో హెచ్‌ఎంగా పనిచేయడమే కాకుండా తాడ్వాయి మండల నోడల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారన్నారు. 38 సంవత్సరాలలో 10 పాఠశాలలో పనిచేసి మంచిపేరు సంపాదించుకున్నారన్నారు. పీఆర్టీయూ రాష్ట్ర కమిటీ తరఫున సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల అలవెన్సులు త్వరగా వచ్చేలా చూస్తామన్నారు. విద్యార్థులు నృత్యాలు, పాటలు అలరించాయి. రమేష్ దంపతులను సన్మానించారు. గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు గంగాధర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుశాల్, మనోహర్ రావు, ఎంఈవోలు రామస్వామి, ఆనందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

ప్రతి గ్రామంలో యోగా, ధ్యాన కేంద్రాలుండాలి



వివిధ జిల్లాల ప్రతినిధులతో స్వామి పరమార్థదేవ్

కామారెడ్డి అర్బన్: తెలంగాణలోని ప్రతి గ్రామంలో యోగా, ధ్యాన కేంద్రాలు ప్రారంభించి ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలని, ఆరోగ్య భారత్ లక్ష్యం కావాలని హరిద్వార్ పతంజలి విశ్వవిద్యాలయం డీన్ స్వామి పరమార్థదేవ్ సూచించారు. ప్రతి కుటుంబం వారానికి ఒక రోజైనా కుటుంబంతో కలిసి దేవాలయానికి వెళ్లి పాజిటివ్ ఎనర్జీ పొందాలని ఆకాంక్షించారు. జిల్లా యోగా భవన్‌లో ఆదివారం నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల భారత్ స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగా సమితి ప్రతినిధులు, కార్యకర్తల సమావేశంతో పాటు వివిధ ఆధ్యాత్మిక, హిందు సంఘాల ప్రతినిధుల సమావేశంలో స్వామి పరమార్థదేవ్ మాట్లాడారు. కామారెడ్డి జిల్లా సమితిని ఆదర్శంగా అన్ని జిల్లాల్లో ఏడాదికి ఒకసారి మెగా యోగా శిబిరాలు నిర్వహించాలని అన్నారు. భారత్ స్వాభిమాన్ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు, జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతికి దగ్గర జీవన విధానం ఉండాలి'

కామారెడ్డి అర్బన్: ప్రకృతికి దగ్గరగా ఉండి ఆహార నియమాలు పాటించాలని, ధ్యానం చేస్తూ దేశభక్తితో దృఢంగా ఉండాలని స్వామి పరమార్థదేవ్ అన్నారు. స్థానిక ఫ్రోబెల్స్ హైస్కూల్‌లో రెండో రోజు మెగా యోగా శిబిరంలో స్వామి పరమార్థదేవ్ మాట్లాడారు. ప్రతి ఒక్కరికి యోగా జీవన విధానం కావాలని, ఎంతటి మొండి వ్యాధులనైనా హరిద్వార్ యోగా పీఠంలో నయం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఒక పూట తింటే యోగి, రెండు పూటల తింటే భోగి, మూడుపూటల తింటే రోగి కావడం తప్పనిసరి అన్నారు. పరిశోధనల ప్రకారం వంటింటి నుంచి చక్కెర, తెల్ల ఉప్పు, మైదా పిండిని దూరం చేస్తే సగం రోగాలను వైద్యం లేకుండా దూరమైపోతాయని చెప్పారు.



యోగాసనాలు వేస్తున్న ప్రజలు

రక్తదానం

కామారెడ్డి అర్బన్: కిలిమంజారో, మౌంట్ కాంగ్ యాట్సే పర్వతాలను అధిరోహించిన రాజంపేట మండలం గుండారం గ్రామానికి చెందిన విస్లావత్ బన్నీ ఆదివారం స్థానిక కేబీఎస్ రక్తనిధి కేంద్రంలో ఎ-పాజిటివ్ రక్తదానం చేశారు. భారత కీర్తి ప్రతిష్టను ఇనుమడించిన విస్లావత్ బన్నీ రక్తదానం చేయడం పట్ల రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలుతో పాటు ప్రతినిధులు జమీల్ హైమద్, జీవన్, వెంకటేష్‌లు అభినందించారు. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించాలన్న బన్నీ ఆకాంక్ష నెరవేరాలని ఆకాంక్షించారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వసంత పంచమి సందర్భంగా అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తాడ్వాయి నుంచి కాకుండా ఇతర మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు.

● క్రమ శిక్షణ, స్ఫూర్తి ఇదేనా..?



క్రమశిక్షణ అలవడడంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎన్‌సీసీలో చేరిన విద్యార్థినులు రోడ్డు భద్రత నిబంధనలను గాలికి వదిలేశారు. నగరంలోని గంగాస్థాన్ నుంచి కంఠేశ్వర్ వైపునకు ఆదివారం ఇలా ఆటోలో పరిమితికి మించి ప్రయాణించారు.
– నిజామాబాద్ అర్బన్

క్రైం కార్నర్

మహిళ మృతదేహం లభ్యం



మాక్లూర్: భర్తతో గొడవపడి ఆవేశంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన భార్య చెరువులో శవమై తేలింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన దండ్ల వెంకట్ కొద్ది రోజుల క్రితం తన భార్యతో గొడవపడి పిల్లలతోపాటు ఆమెను పుట్టింటింకి పంపించాడు. పది రోజుల క్రితం బోదాసు లలిత(40) అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు అప్పటికే ఎనిమిదేళ్ల కూతురు ఉంది. అయితే వెంకట్ రెండో పెళ్లి చేసుకున్న విషయం తెలిసి మొదటి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శనివారం రాత్రి వెంకట్, లలిత గొడవపడ్డారు. లలిత క్షణికావేశంలో సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి అందులో దూకింది. రాత్రి వేళ వెతకడం సాధ్యం కాకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు. ఆదివారం ఉదయం చెరువులో లలిత మృతదేహం తేలడంతో పోలీసులు బయటికి తీయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెర్కిట్‌లో గడ్డివాము దగ్ధం



ఆర్మూర్‌టౌన్: పట్టణ పరిధిలోని పెర్కిట్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు సమాచారం మేరకు ఘటనాస్థలానికి ఫైరింజన్ చేరుకుంది. ఫైర్ సిబ్బందిని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.25వేల నష్టం వాటిల్లిందని బాధితుడు రంజిత్ తెలిపారు.

మహిళ అదృశ్యం



రామారెడ్డి: మండలంలోని ఉప్పల్‌వాయికి చెందిన మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చాకలి శ్యామల(41) అనే మహిళకు మతిస్థిమితం లేదు. 40 రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆమె కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో శ్యామల భర్త స్వామి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

నవీపేట : మండలంలోని బినోల గ్రామ శివారులో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. గ్రామానికి చెందిన కన్నం మహేందర్ మరో వ్యక్తితో కలిసి తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించి హుండీలోని నగదును ఎత్తుకెళ్లారన్నారు. గ్రామానికి చెందిన అయిటి దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్‌ఆర్‌లో ఉన్నత విద్యావకాశాలు



వరదారెడ్డిని సన్మానిస్తున్న విద్యా సంస్థల సిబ్బంది

నిజామాబాద్ అర్బన్: ఎస్‌ఆర్ యూనివర్సిటీ ద్వారా ఇంటర్మీడియెట్ తర్వాత ఎన్నో ఉన్నత విద్యావకాశాలు ఉన్నాయని, వాటిని జిల్లాకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఆర్ యూనివర్సిటీ ఛాన్సలర్, ఎస్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏ వరదారెడ్డి అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు ఎస్‌ఆర్ యూనివర్సిటీ ద్వారా అందిస్తున్న కోర్సులు, సౌకర్యాలు, ఉన్నత విద్య అవకాశాలను వివరించారు. ఎన్ఐఆర్ఎఫ్ గుర్తింపు కలిగి జాతీయ స్థాయిలో 98వ ర్యాంకు ఉన్న తెలంగాణలోనే ఏకైక యూనివర్సిటీ ఎస్‌ఆర్ అని తెలిపారు. ఎస్‌ఆర్ యూనివర్సిటీలో బీటెక్ కోర్సులతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్, బిజినెస్ స్కూల్, మేజర్ డిగ్రీ, మైనర్ డిగ్రీలు ఒకేసారి పొందే అవకాశం ఉందన్నారు. ఇంటర్నేషనల్ ఇంజినీరింగ్ ప్రోగ్రాంలో భాగంగా మూడు సంవత్సరాలు ఇక్కడ, రెండు సంవత్సరాలు అమెరికాలో, రెండు సంవత్సరాలు ఇక్కడ, రెండు సంవత్సరాలు ఆస్ట్రేలియాలో ఇంజినీరింగ్ పూర్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు స్టార్టప్ కంపెనీలను స్థాపించేందుకు యూనివర్సిటీనే పెట్టుబడి పెడుతుందన్నారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఈ అవకాశాన్ని నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ అనిత, అడ్మిషన్ డైరెక్టర్ శేషగిరిరావు, సీనియర్ డైరెక్టర్ రామ్ దేశ్‌ముఖ్ తమ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో నిజామాబాద్ డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

వరద కాలువ ద్వారా నీటి విడుదల నిలిపివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు ఆదివారం నిలిపివేశారు. ప్రాజెక్ట్ నుంచి వారబందీ ప్రకారం కాకతీయ కాలువ జోన్-2 ఆయకట్టుకు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ నీటి వృథా ఎక్కువగా ఉండడంతో 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేపట్టారు. కాకతీయ కాలువ ద్వారా 4,500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 250, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 210, గుత్ప ఎత్తిపోతల ద్వారా 270, సరస్వతి కాలువ ద్వారా 700, ముంపు గ్రామాల ఎత్తిపోతల ద్వారా 312 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ఆవిరి రూపంలో 349 క్యూసెక్కుల నీరు పోతోంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1080.90(47.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇందల్వాయి: మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకున్న ప్రమాదంలో బత్తుల నాగరాజు(32) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగరాజు నిజామాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా సర్వీస్ రోడ్డు వద్ద పెట్టిన మట్టి బ్యాగులను బైక్ ఢీకొని కింద పడిపోయాడు. అదే సమయంలో దూసుకొచ్చిన కంటైనర్ ఢీకొట్టడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తి అని తెలిసింది. సమాచారం అందుకున్న ఎస్సై మనోజ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఘటనాస్థలంలో నాగరాజు మృతదేహం

పేకాటస్థావరంపై దాడి

వేల్పూర్ : మండలంలోని పడగల్ గ్రామంలోని కోళ్ల ఫామ్‌లో కొనసాగుతున్న పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, సీసీఎస్ సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.35,460 నగదుతోపాటు 13 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సమాచారం.

బేకరీ ఓనర్‌కు కత్తులతో బెదిరింపు

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ధర్మపురి హిల్స్‌లో బేకరీ ఓనర్‌ను కత్తులతో బెదిరించిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. పాల ప్యాకెట్ విషయంలో తలెత్తిన వివాదంలో నలుగురు యువకులు బేకరీలో కత్తులతో వీరంగం చేసినట్లు సమాచారం. ధర్మపురి హిల్స్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు శుక్రవారం సాయంత్రం పాల ప్యాకెట్ కోసం తన ఇంటి సమీపంలోని బేకరీకి వెళ్లగా ధర విషయంలో యజమానితో వాగ్వాదం చోటు చేసుకుంది. మరుసటి రోజు నలుగురు స్నేహితులతో కలిసి బేకరీకి వెళ్లిన యువకుడు యజమానితోపాటు అడ్డు వెళ్లిన వారిని సైతం కత్తులతో బెదిరించారు. బేకరీ యజమాని ఫిర్యాదు మేరకు బెదిరింపులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

రెండున్నర కిలోల గంజాయి పట్టివేత

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ చౌరస్తాలో పోలీసులు ఆదివారం ఉదయం రెండున్నర కిలోల గంజాయిని పట్టుకున్నారు. నందిపేట పోలీస్టేషన్‌లో సీఐ శ్రీధర్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలో గంజాయి సరఫరా జోరుగా సాగుతోందనే ప్రచారం నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ప్రత్యేక టీము నిఘా సారించింది. పక్కా సమాచారం మేరకు ఆదివారం ఉదయం పోలీసులు వెల్మల్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఉదయం 10 గంటల సమయంలో నిజామాబాద్‌కు చెంది షేక్ అఫ్రోజ్, షేక్ మహబూబ్ స్కూటీపై వస్తుండగా అనుమానంతో వాహనాన్ని తనిఖీ చేసి స్కూటీ డిక్కీలో రెండున్నర కిలోల గంజాయిని గుర్తించారు. పోలీసులు వారిని విచారించగా మండలంలోని యువకులు, విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. అఫ్రోజ్ గతంలో గంజాయి కేసులో పట్టుబడినట్లు సీఐ తెలిపారు. యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్ రెడ్డి